క్లుప్తంగా

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న తౌహిద్‌ఖాన్ తదితరులు

కడప కల్చరల్ : కడప నగరంలోని ఆశా నిలయంలో అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు, యువ ఆడిటర్ పి.తౌహిద్‌ఖాన్ గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆశా నిలయంలోని మూగ, చెవిటి విద్యార్థులు చలి కాలంలో వారు పడుతున్న బాధలను గమనించి తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఆశా నిలయం నిర్వాహకులు సిస్టర్ జ్యోతి ధన్యవాదాలు తెలిపారు. ఆర్కే హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి విష్ణువర్ధన్ ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేశారు. సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే విజయం సాధ్యమవుతుందని వైవీయూ లలిత కళల విభాగ ఆచార్యులు మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. రిమ్స్ రోడ్డులో ఉన్న స్పిరిట్ డిగ్రీ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా నైతిక విలువలను కలిగి ఉండాలని తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు.ప్రతి ఒక్కరూ మాతృభాషపై అభిమానం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నిర్మల, ప్రిన్సిపాల్ ఎంసీ రవీంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్: రానున్న పది పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. గురువారం తమ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం -2023కు సంబంధించిన డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు పోగుల వెంకట్రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, బోగేశ్వరావు, మీడియా ఇన్‌చార్జు బాలకృష్ణుడు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవోస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

కడప కార్పొరేషన్: ఏపీ ఎన్‌జీఓ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను వైద్య, ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్‌జీఓస్ అసోసియేషన్ వారు రూపొందించిన నూతన సంవత్సర టేబుల్ క్యాలెండర్ బాగుందని అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు బి. శ్రీనివాసులు, కార్యదర్శి డి. రవి కుమార్, నగర అధ్యక్షుడు కె. చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కడప రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ నాగరాజు ఆవిష్కరించారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్, డీసీఎంఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మల్లీశ్వరి, ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామ సుబ్బారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 1ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని పొందుపరిచిన హక్కులను కాలరాయడం సరికాదన్నారు. ప్రశ్నించే గొంతుకలను అణచి వేసేందుకు రాష్ట్రంలో రోడ్ షోలు, సభలు, సమావేశాలు జరపకూడదంటూ జీవో 1ను తీసుకురావడం దారుణమన్నారు.

విద్యార్థులకు కమిషనర్ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న కమిషనర్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని నగరపాలకోన్నత పాఠశాల (మెయిన్) విద్యార్థులు రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన 10 పతకాలను కై వసం చేసుకున్నారు. వీరికి గురువారం కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ జి. సూర్యసాయిప్రవీణ్‌చంద్ చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పాఠశాల క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎల్. వెంకటలక్ష్మి , క్రీడాకారులు నవీనత, యాస్మిన్, లోకేష్, గోవర్ధన్, జాఫర్, శ్రీనికిత, మన్సూర్, నిఖిల్, హరిణి, ప్రసాద్, గౌరి పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను దీవించండి

- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- 43వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

కడప కార్పొరేషన్: దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సంక్షేమ సారధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దీవించాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 43వ డివిజన్ పరిధిలోని రవీంద్రనగర్, పాత కాలేజ్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడం లేదా ..అని ఆరా తీశారు. ఈ సందర్భంగా చల్లా తులసి అనే మహిళ మాట్లాడుతూ తనకు వైఎస్సార్ ఆసరా, చేయూత, వసతి దీవెన, వైఎస్సార్ పింఛన్ కానుక, విద్యాదీవెన, ఇంటి స్థలం వంటి పథకాలతో రూ.10.50లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. వి. జయలక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ తమ కుటుంబానికి జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, విద్యాదీవెన, సున్నావడ్డీ, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.10.18లక్షల లబ్ధి చేకూరిందని తెలిపింది. పేదలకు సాయం చేస్తున్న ఈ ప్రభుత్వమే కలకాలం ఉండాలని లబ్ధిదారులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 43వ డివిజన్ ఇన్‌చార్జి రెడ్డి ప్రసాద్, మాజీ కార్పొరేటర్ జమాల్‌వలీ, పార్టీ నాయకులు బీహెచ్ ఇలియాస్, తుమ్మల కుంట శివశంకర్, సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, షఫీ, మియ్యా,అంజి, వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, నారాయణమ్మ పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



7వ డివిజన్‌లో పింఛన్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

అవ్వాతాతలకు జగనన్న సంక్రాంతి కానుక

కొత్త సంవత్సరంలో పింఛన్ల పెంపు ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు సంక్రాంతి కానుక అందించారని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. గురువారం 7వ డివిజన్‌లోని శంకరాపురంలో, 14వ డివిజన్‌లోని ప్రకాష్‌నగర్‌లో జగనన్న ప్రభుత్వం రూ.2750కి పెంచి ఇచ్చిన పింఛన్ కానుకను, కొత్త పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 14వ డివిజన్ కార్పొరేటర్ కె. బాబు, 7వ డివిజన్ ఇన్‌చార్జి గంగరాజు, నాయకులు సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, షఫీ పాల్గొన్నారు.

సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలి

డిప్యూటీ సీఎంకు వినతి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని జిల్లా ఉక్కుసాధన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బి.నారాయణ డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషాకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదేళ్లయినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలో ఐదు సంవత్సరాలు అధికారంలో ఉన్న టీడీపీ శంకుస్థాపన చేసి శిలాఫలకం ఏర్పాటు చేసి హంగామా తప్ప చేసిందేమీ లేదన్నారు. విభజన చట్టంలో తెలిపిన విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. ప్రైవేటు రంగంలో ఉక్కు పరిశ్రమ నిర్మించడం ద్వారా పర్మినెంటు ఉద్యోగాలు అతి స్వల్పంగా ఉంటాయని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వికలాంగుల వర్గాల ప్రజలకు రిజర్వేషన్ అమలు కాకుండా ఉద్యోగ అవకాశాలు కోల్పోతారన్నారు. జిల్లా ఉక్కు సాధన ఐక్యవేదిక నాయకులు అన్వేష్, సత్తార్, గుర్రప్ప, శ్రీనివాసులు రెడ్డి, సీఆర్‌వీ ప్రసాద్, జిలానీబాషా పాల్గొన్నారు.

వరద సహాయక పనులకు సాధారణ నిధులు

నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మాణం

కడప కార్పొరేషన్: కడప నగరంలో చేపట్టిన వరద సహాయక పనులకు సంబంధించిన రూ.29.08లక్షలను సాధారణ నిధుల నుంచి చెల్లించేందుకు నగరపాలక స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. గురువారం సాయంత్రం కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్ చంద్ అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. పదవ తరగతి ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు, మున్సిపల్ స్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత నివారించేందుకు అదనంగా 15 మంది విద్యా వలంటీర్లను తీసుకునేందుకు ఆమోదం తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ శోభన్‌బాబుకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించేందుకు అంగీకారం తెలిపారు. నగరంలో పెరుగుతున్న జనాభా, ప్రజావసరాలు తీర్చేందుకు రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు చేపట్టేందుకు టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్, డ్రిల్లింగ్ మెషినరీ, సమ్మెటలు, గడ్డపారలు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.15లక్షల చొప్పున మున్సిపల్ మైదానం, వై జంక్షన్, ప్రగతి భవన్ వద్ద టాయ్‌లెట్లు నిర్మించేందుకు టెండర్లను ఆమోదించారు. అప్సర జంక్షన్ నుంచి కేసీ కాలువ వరకూ మురుగునీటి కాలువ నిర్మించే క్రమంలో విద్యుత్ శాఖకు చెందిన ప్రహరీ కూలిపోయింది. దాన్ని రూ.21లక్షలతో పునర్నిర్మించేందుకు రూపొందించిన అంచనాలను ఆమోదించారు. డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎస్ఈ రత్నాల రాజు, సీపీ సంజీవ్ కుమార్, స్టాండింగ్ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, వెల్లాల శిరీష, మేసా ప్రమీలారాణి, షఫీ, హేమలత పాల్గొన్నారు.



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్

జీఓ 1పై దుష్ప్రచారం సరికాదు



అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్: ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు పబ్లిసిటీ షో కోసం జనం ప్రాణాలు బలయిపోతున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మారుతీ నగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కందుకూరులో ఇరుకు రోడ్డులో బహిరంగ సభ నిర్వహించి 8 మంది ప్రాణాలు బలికొన్న చంద్రబాబు, గుంటూరులో పది వేల మందికి చీరెలు ఇస్తామని టోకెన్లు ఇచ్చి 30వేల మందిని రప్పించి మరో ముగ్గురిని పొట్టనబెట్టుకున్నారన్నారు. ఇలాంటి ఉదంతాలు జరిగి సామాన్యులైన పేదవారి జీవితాలు ఛిద్రం కాకూడదనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతాయుతంగా రోడ్లపై సభలు పెట్టకూడదని జీఓ ఇచ్చారన్నారు. దీనిపై నానా రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. ఈ జీవో ఒక్క టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ, సీపీఎం పార్టీలకేగాక వైఎస్సార్‌సీపీకి కూడా వర్తిస్తుందనే విషయాన్ని గుర్తెరగాలన్నారు. కానీ ప్రతిపక్షాలు దీనిపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175కు 175 సీట్లు సాధించడం ఖాయమని, తెలుగుదేశం పార్టీ తుడిచిపెట్టుకుపోవడం తథ్యమని జోస్యం చెప్పారు.

ఈ క్రాప్ బుకింగ్ 100 శాతం పూర్తి చేయాలి

కమలాపురం : కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో రైతులు సాగు చేసిన పంటలకు 100 శాతం ఈ–క్రాప్ బుకింగ్ చేపట్టాలని కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని వ్యవసాయ సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఈ–క్రాప్ బుకింగ్ ఎంత మేరకు చేశారో మండలాల, ఆర్‌బీకే వారిగా రివ్యూ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 75 శాతం ఈ–క్రాప్ బుకింగ్ చేశారన్నారు. మిగిలిన 25 శాతం కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మీ పరిధిలోని రైతులందరిని కలసి వారు సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. అలాగే 13వ విడత పీఎం కిసాన్ డబ్బులు ఖాతాల్లో జమ కావాలంటే రైతులు తప్పని సరిగా ఈ–కేవైసీ చేసుకోవాలన్నారు. ఆర్‌బీకే సిబ్బంది వైఎస్సార్ యాప్ పనితీరును మెరుగు పరచుకోవాలన్నారు. అలాగే పంట కోత ప్రయోగాలకు సంబంధించిన ఫామ్–1ను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కమలాపురం, వీఎన్‌పల్లె మండలాల ఏఓలు సరస్వతి, శ్యామ్‌బాబు, హాట్ ఏఓ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు రామకృష్ణమఠం స్కాలర్‌షిప్

కడప కల్చరల్ : స్వామి వివేకానందుని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కడప రామకృష్ణమఠం ద్వారా ప్రతిభగల విద్యార్థులకు ఈనెల 12న ఆర్థికసాయం చేయనున్నట్లు మఠం కడప కార్యదర్శి స్వామి భీతిహరానంద తెలిపారు. ప్రవాస భారతీయ స్వచ్ఛంద సంస్థ (చిల్డ్రన్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్-సీహెచ్ఈఓ) వారి ఆర్థిక సాయంతో ప్రతి ఏడాది పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ప్రతిభగల పేద విద్యార్థులకు ఈ సహకారం అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతిభ గల పేద విద్యార్థులను గుర్తించేందుకు ఈనెల 8న రిమ్స్ సమీపాన గల రామకృష్ణ మిషన్‌లో విద్యార్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతిభ గల పేద విద్యార్థులు వ్యక్తిగత గుర్తింపు పత్రాలు, ప్రతిభను నిరూపించడానికి అవసరమైన పత్రాలతో ఉదయం 9 గంటలకు రామకృష్ణ మిషన్ ప్రాంగణానికి రావాలని వివరించారు.

జోరుగా రథం మరమ్మతు పనులు



రథానికి మరమ్మత్తులు చేస్తున్న కార్మికులు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ రథం మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. దీంతో మూడు రోజులుగా తలెత్తిన స్వల్ప వివాదాలకు తెరపడినట్లయింది. మరో రెండు వారాల్లో దేవునికడప ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా ప్రతిసారి లాగానే ఈ ఏడాదికూడా రథాన్ని ఊరేగింపుగా సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా రథంపై రక్షణ ఏర్పాటు చేసిన ఇనుప రేకులను తొలగించి రథాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైనచోట మరమ్మతులు చేస్తారు.దాన్ని పూర్తిగా నీటితో శుభ్రపరిచి చక్రాలను మరింత పదిలం చేసి రంగులు వేస్తారు.

రథంలోని కొన్ని భాగాలు చెదలు పట్టి పుచ్చిపోయాయని, కార్మికులు మొక్కుబడిగా మరమ్మతులు చేస్తున్నారని, గ్రామ వాసులుగా తాము ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం చెప్పడమే కాకుండా పనుల్లో ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని స్థానిక యువత సోషల్‌మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ చేయడంతో సమస్యపై పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సాక్షి గురువారం రథం మరమ్మతులను పరిశీలించింది. ఏఈ కళావతి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా ఆమె నిర్లక్ష్యం వహించే సమస్యే లేదని, రథానికి పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేపడతామని స్పష్టం చేశారు. ఎక్కువ మంది నిపుణులను పిలిపించి నిర్ణీత సమయంలో రథానికి మరమ్మత్తులు చేపడతామని, నీటితో శుభ్రం చేయడంతోపాటు రంగులు కూడా వేయిస్తామని, చక్రాలకు కూడా మరమ్మత్తులు చేయిస్తున్నామని ఏఈ సమాధాన మిచ్చారు.

సీఆర్‌పీలను అవమానించడం తగదు



ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న సీఆర్‌పీలు

కడప ఎడ్యుకేషన్: పొద్దుటూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో తప్పిపోయిన ట్యాబుల వ్యవహారంపై పోలీసులతో పూర్తిస్థాయి విచారణ జరిపి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఆర్‌పీల హక్కులసాధన సమితి రాష్ట్ర కన్వీనర్ ఆదిమూలం శంకర్ డిమాండ్ చేశారు. ఈ విషయానికి ఎలాంటి సంబంధం లేని సీఆర్‌పీలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించడం ఎంతవరకు సబబన్నారు. పోయిన ట్యాబ్‌లు దొరికినా సరే సీఆర్‌పీలను విచారించాలని ఎంఈఓ మాట్లాడటం చాలా అన్యాయం అన్నారు. ఈ విషయమై గురువారం కడపలో సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిని తమ కార్యాలయంలో కలిసి సీఆర్‌పీలు వినతిపత్రమిచ్చారు. ప్రొద్దుటూరు మండల సీఆర్‌పీలు భాస్కర్, సరస్వతి, గాయత్రి, హెలినా, బషీరున్నీసా, కదిరునిషా,సువార్తమ్మ, రమాదేవి, నాగేంద్ర, వరప్రసాద్, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

– రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శంకర్

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ విద్యార్థి యువజన సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శంకర్ కోరారు. కడపలోని రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 30,31 తేదీల్లో రెండు రోజులపాటు జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గత కార్యక్రమాలను సమీక్షించడంతో పాటు భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. నగర అధ్యక్ష కార్యదర్శులు శివ, సోయల్, నగర సహాయ కార్యదర్శి నాయస్, నగర ఉపాధ్యక్షుడు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంలోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్‌రామాంజులు రెడ్డిలు అన్నారు. గురువారం మండలంలోని ఇప్పెంట పంచాయతీ పరిధిలో రెండవ రోజు ఆర్‌టీపల్లె, ఇప్పెంట అగ్రహారం, వెంకట్రామ్‌పల్లె, చంద్రప్రతాప్‌కాలనీలలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి గడపలో అర్హులను గుర్తించి వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలందరికీ మెరుగైన పాలన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, పంచాయతీ సర్పంచ్‌లు కొత్తపల్లి రాజశేఖర్ రెడ్డి, మల్లిఖార్జునయాదవ్, సుబ్బరాయుడు, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, ఎంపీటీసీలు నారే నాగరాజు, వెంకటరెడ్డి, యూత్ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, కువైట్ బాషా, బీసీ సెల్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపసర్పంచ్ లక్కిరెడ్డి రమణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

మండలంలోని బుగ్గలపల్లె సబ్‌స్టేషన్ నుంచి ఆర్‌టీపల్లె వరకు నిర్మించిన సిమెంట్ రోడ్డును గురువారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుగ్గలపల్లి సబ్ స్టేషన్ నుంచి ఆర్‌టీపల్లెకు వెళ్ళే రహదారి అధ్వానంగా ఉండడంతో పంచాయతీ రాజ్‌శాఖ నిధులతో సిమెంట్‌రోడ్డు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో-కన్వీనర్ కళాయాదవ్, సర్పంచ్‌లు కె.రాజశేఖర్‌రెడ్డి, మల్లిఖార్జున యాదవ్, ఎంపీటీసీ నారే నాగరాజు, ఉప సర్పంచ్ లక్కిరెడ్డి రమణారెడ్డి, ఎంపీడీఓ రవికుమార్‌రెడ్డి, తహసీల్దార్ గంగయ్య, ఎంఈఓ వెంకట్రామిరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

– కడప ఎంఈఓ పాలెం నారాయణ

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని కడప మండల విద్యాశాఖ అధికారి పాలెం నారాయణ సూచించారు. ఈ నెల 24న ప్రపంచ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కడప నగరం ప్రభుత్వ బాలికల పాఠశాలలలో విద్యార్థులకు వ్యాసరచన , వక్తృత్వ, పెయింటింగ్, డిబేట్ కాంపిటేషన్, సేవ్ ది గర్ల్స్ అండ్ వార్మ్ అనే సబ్జెక్టులపై జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాలెం నారాయణ మాట్లాడుతూ ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షర్మిల, సీఆర్‌పీలు జమీల, వెంకటాద్రి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

7న రాజకీయ శిక్షణ తరగతులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరంలో ఈ నెల 7న సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ వెల్లడించారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల పేదరికం , నిరుద్యోగం వంటివి రోజు రోజుకు పెరిగిపోతున్నాయని తెలిపారు. నగరంలో నివసిస్తున్న ప్రజానీకం మీద చెత్త పన్ను, నీటి మీటర్లు, విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో కొత్త కొత్త భారాలు మోపే దిశగా పాలకులు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీపీఎం నాయకులు చంద్రా రెడ్డి, ఫరూక్ హుస్సేన్ పాల్గొన్నారు.

హోమియోపతి కళాశాల రోడ్డును బాగు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని 48వ డివిజన్ పరిధిలో గల పరమేశ్వర స్కూల్ నుంచి హోమియోపతి కళాశాల వరకు అధ్వానంగా ఉన్న రోడ్డును బాగు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ కోరారు. గురువారం నగరంలోని హోమియోపతి కళాశాలకు వెళ్లే రహదారిలో కొత్త రోడ్డు వేసి బాగు చేయాలని కోరుతూ హోమియోపతి కళాశాల వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా రహదారి మరమ్మతులకు నోచుకోకపోవడం వల్ల అనేక మంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పులి కృష్ణమూర్తి, మునెయ్య, మల్లిఖార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: స్వచ్ఛ భారత్ మిషన్‌లో పని చేస్తున్న క్లాప్ మిత్రల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట స్వచ్ఛ భారత్ మిషన్‌లోని క్లాప్ మిత్రలకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ రెండవ రోజు నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న క్లాప్ మిత్రలకు పది నెలల పెండింగ్ వేతనాలను సంక్రాంతి పండుగలోపల అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ కార్మికుల యూనియన్ నాయకులు వెంకట సుబ్బయ్య, కేసీ బాదుల్లా, సుబ్బరాయుడు, ఆనందరావు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీ సత్యదేవునికి పూజలు

కడప కల్చరల్ : ధనుర్మాసం పౌర్ణమి సందర్భంగా కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రాతఃకాలంలో అభిషేకం తదితర పూజలనంతరం ఉదయం 7.00 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ తెలిపారు.

హక్కుల కోసం పోరాటాలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మైనార్టీల హక్కుల కోసం ఆప్‌కీ ఆవాజ్ పోరాటాలు చేస్తోందని హజ్ కమిటీ చైర్మెన్ గౌస్‌లాజం పేర్కొన్నారు. గురువారం నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆప్‌కీ ఆవాజ్ ఉర్దూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా, ఎన్ఆర్‌సీ జేఏసీ కన్వీనర్ అహ్మద్ బాబు భాయ్, ఆప్‌కీ ఆవాజ్ నాయకులు షంషీర్ ఖాన్, అబిద్, ఫరూక్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జాతీయ పక్షి దినోత్సవం

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ పక్షి దినోత్సవం నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రాచీన రోజుల్లో సాంకేతికత అభివృద్ధి చెందని రోజుల్లో పక్షులు వార్తావాహక విధిని నిర్వహించడంతో పాటు యుద్ధ సమయాల్లో సైతం కీలక సమాచారాన్ని అందించేవన్నారు. కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి వై. సావిత్రి మాట్లాడుతూ పక్షులు ఎంతో వైవిధ్యభరితమైన జంతువులని పేర్కొన్నారు. కాలుష్యాన్ని తగ్గించి పక్షులు, జంతుజాతులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల అధ్యాపకులు డా. సి. నరసింహారావు, యు. శ్రీనీత, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

వైవీయూ : స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో కడప నగరంలోని రిమ్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏబీవీపీరాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎం.అశోక్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివేకానందుని స్ఫూర్తితో యువత సమాజానికి సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు బాలాజీ, రోహిత్, గణేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.